# రసవత్తర రాజకీయం

## ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేస్తా

### ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి




మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్/కాప్రా, అక్టోబర్ 7: ప్రజలు ఆశీర్వదించి ఓటు వేస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి వంద పడకల హాస్పిటల్ మంజూరు చేయించినట్టుగానే డిగ్రీ, జూనియర్ కళాశాలలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బీఎల్ఆర్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసిన దివ్యాంగులు

చిక్కడపల్లి, అక్టోబర్ 7: దివ్యాంగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ ఇండియా) ముషీరాబాద్ నియోజకవర్గం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని శనివారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశం ఏ రాష్ట్రంలో లేని విధంగా 5 లక్షల 46వేల మంది దివ్యాంగులకు నెలకు రూ. 4,116 పెన్షన్ అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం వ్యవస్థాపకుడు తుండుం రాజేందర్, లక్ష్మీగణపతి దేవాయంలో చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం డివిజన్ల అధ్యక్షులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ముషీరాబాద్ డివిజన్ కమిటీ అధ్యక్షునిగా పూస సుధాకర్, అడిక్‌మెట్ అధ్యక్షునిగా పులికంటి సైదులు, బోలక్‌పూర్ అధ్యక్షునిగా కత్తుల యకయ్య, కవాడిగూడ అధ్యక్షుడిగా శబరీ చావ్లా, రాంనగర్ అధ్యక్షునిగా కృష్ణా, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడిగా హనుమా నాయక్, ముషీరాబాద్ మహిళా అధ్యక్షులుగా ధనమ్మ ఎన్నికయ్యారు.

## టమాటలు ఎట్ల కిలో ?



మంత్రాల చెరువు సమీపంలో స్ట్రీట్ వెండర్ కోసం ఏర్పాటు చేసిన షాపుల దగ్గర కూరగాయలు కొంటున్న మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

# ఉప్పల్ కాంగ్రెస్.. తిప్పలు వేరయా!

- నేటికీ ఖరారుకాని కాంగ్రెస్ అభ్యర్థి
- ఎవరికి వారే.. యమునా తీరే..
- జోరుగా గ్రూపు రాజకీయాలు
- అయోమయంలో కాంగ్రెస్ క్యాడర్



సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ)/ఉప్పల్ : గ్రేటర్‌లోని ఉప్పల్ నియోజకవర్గంలో గులాబీ పార్టీ జెండా రెప రెపలాడుతుంటే.. కాంగ్రెస్ పార్టీ జెండా విల విలాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రచారంలో దూసుకుపోతుంటే.. కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థి పేరు ఇంకా ఖరారు కాలేదు. దీంతో అక్కడ ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా రాగిడి లక్ష్మారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, సోమిరెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరు ఎవరికి వారే తమ గాడ్ ఫాదర్‌ల ద్వారా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కొంతమంది నేతలు టికెట్ కోసం ఢిల్లీకి సైతం వెళ్లి, తమ నేతలతో పైరవీలు చేస్తున్నారు. టికెట్‌పై ఎలాంటి సమాచారం లేకపోవడంతో ముగ్గురు అభ్యర్థులు ఎవరికి వారు తమ ఇష్టారాజ్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరికి మాత్రమే అసెంబ్లీ సీటు వచ్చే అవకాశం ఉంటుంది. మిగిలిన ఇద్దరు అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉంటే మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పటికీ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

### గ్రూపులతో అయోమయం

పార్టీ ప్రచారం, గ్యారెంటీ పథకాల ప్రచారంలో గ్రూపులుగా విడిపోయి ప్రచారాలు చేసుకుంటున్నారు. డివిజన్ల వారీగా గ్రూపులుగా వచ్చి ప్రచారాలు చేస్తుండటంతో కార్యకర్తలు, ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. టికెట్ ఆశిస్తున్న నేతలు తమ తమ అనుచర వర్గంతో గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్ వచ్చే ఎన్నికల్లో కలిసి మెలిసి పనిచేసే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. గతంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రెండు గ్రూపుల మధ్య ఫ్లెక్సీ కొట్లాట జరిగింది. వీరిపై పోలీసు కేసులు కూడా నమోదు చేసుకోవడం గమనార్హం. అయితే ఉప్పల్‌లో బీఆర్ఎస్‌పార్టీ బలంగా ఉండటంతో పోటీ చేయడానికి ప్యారాచూట్ నేతలు వస్తారని ప్రచారం సాగుతుంది.

### ఇదీ చరిత్ర...

2009లో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంగా మారింది. నాటి నుంచి లెక్కిస్తే ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాలేదు. ఆ తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పది డివిజన్‌లలో పోటీ చేస్తే ఒక్క డివిజన్‌లో స్వల్ప మెజారిటీతోనే ఆ పార్టీ అభ్యర్థి గెలిచారు. మిగితా తొమ్మిది డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే విజయకేతనం ఎగురువేశారు. ఇక 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి కూడా లేకపోవడంతో క్యాడర్ పూర్తిగా నిరుత్సాహంలోకి వెళ్లింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న బండారి లక్ష్మారెడ్డి 2018లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినా, మిగితా 8 చోట్ల కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. రెండవ స్థానంలో కూడా నిలువలేకపోయింది. 2018లో గులాబీ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. ఇదే స్ఫూర్తితో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఉప్పల్ నియోజక వర్గంలో గులాబీ పార్టీ జెండా ఎగురుతుందని స్థానిక ఓటర్లు గట్టి నమ్మకంతో ఉన్నారు.


# తగ్గేదెవరు.. నెగ్గేదెవరు..

## బీజేపీలో బడా నేతల సీటు ఫైట్

- బిడ్డ కోసం దత్తన్న.. పట్టు కోసం లచ్చన్న
- హాట్‌హాట్‌గా మారిన ముషీరాబాద్ సీటు

**శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ సీటు హాట్ హాట్‌గా మారింది. అసెంబ్లీ సీటు విషయంలో ఇద్దరు బడా నేతల మధ్య అంతర్గత వార్ కొనసాగుతున్నది. ఒకరు వారసురాలికి టికెట్ ఇప్పించుకోవడానికి పావులు కదుపుతుండగా, మరో నేత పట్టును నిలబెట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.**

**- ముషీరాబాద్, అక్టోబర్ 7**



రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా మారిన ముషీరాబాద్ బీజేపీ టికెట్ ఇద్దరు అగ్రనేతల మధ్య అంతర్గత వైరానికి దారి తీస్తుంది. ఆ ఇద్దరు బడా నేతల్లో ఒకరు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాగా మరొకరు రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరి బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్. ఇద్దరూ ఉన్నత పదవుల్లో ఉన్నవారే కావడం, సొంత నియోజకవర్గం టికెట్‌ను ఇద్దరు నేతలు తమ పలుకుబడిని ఉపయోగించుకొని ఒకరు వారసురాలికి, మరొకరు ముఖ్య అనుచరునికి ఇప్పించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయమై దత్తాత్రేయ, లక్ష్మణ్‌ల మధ్య దూరం పెరిగినట్లు సమాచారం. ఇదే విషయమై నియోజకవర్గం పార్టీ శ్రేణుల్లో ప్రచారం సాగడంతో ఇటీవల దత్తాత్రేయతో సమావేశమైన లక్ష్మణ్ తన అసంతృప్తిని వెళ్లగక్కినట్లు తెలిసింది. అనుకోని పరిస్థితుల్లో వారిద్దరినీ అధిష్ఠానం కాదంటే తమకు అవకాశం వస్తుందేమోనని ఆ పార్టీకి చెందిన 36 మంది నాయకులు ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

### వారసురాలి కోసం దత్తన్న ఆరాటం..

బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ సారి ఎన్నికల్లో తన వారసురాలిని బరిలో నిలపడానికి పావులు కదుపుతున్నారు. తాను నివాసం ఉంటున్న ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి తన కూతురు విజయలక్ష్మిని బరిలో నిలపాలని భావిస్తున్నారు. ఇప్పటికే అంతర్గత కార్యకలాపాలు మొదలు పెట్టిన దత్తాత్రేయ, ఆయన కూతురు విజయలక్ష్మి పార్టీ సీనియర్ నాయకులతో డివిజన్‌ల వారిగా సమావేశమై చర్చించినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో టికెట్ తనకే వస్తుందని, తన గెలుపుకోసం సహకరించాలని దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి పార్టీ నేతలను కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పలు పార్టీ, ఇతర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న ఆమె తండ్రిని నమ్ముకొని టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. దత్తాత్రేయ సైతం వయో భారం, గవర్నర్ పదవీ కాలం మరో యేడాదిలో ముగియనుండటంతో తన వారసురాలికి టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం.

### పట్టు కోసం లక్ష్మణ్ పోరాటం..



ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు శాసనసభ్యునిగా ఎన్నికైన డాక్టర్ లక్ష్మణ్ తనకు ఉన్న పట్టును కొనసాగించడానికి తన ముఖ్య అనుచరునికే టికెట్ ఇప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బీజేపీ అధిష్ఠానం లక్ష్మణ్‌ను అసెంబ్లీ బరిలో నిలవాలని సూచిస్తున్నా పోటీకి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం యూపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యునిగా కొనసాగుతున్న లక్ష్మణ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఇష్టపడటం లేదు. రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేని లక్ష్మణ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతే రెంటికీ చెడ్డ రేవడిగా మారుతుందనే భయం వెంటాడుతున్నట్లు ప్రచారం సాగుతుంది. అదే సమయంలో ముషీరాబాద్ సీటు కోసం తన ముఖ్య అనుచరున్ని తెరపైకి తీసుకువస్తున్నారు.